క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ జి.దాస్

సాక్షి, భీమవరం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నీతి కథలు, డ్యాన్స్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం ట్రాఫిక్ సీఐ జి.దాస్ మాట్లాడుతూ బైక్ మీద ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించకూడదని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. ట్రాఫిక్ కూడలిలో రెడ్ లైట్ పడినప్పుడు ఆగాలని, గ్రీన్ లైట్ పడినప్పుడు వెళ్లాలని విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, డి.రామనాగేశ్వరరావు, డి.శ్యామ్, గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ బైక్ ర్యాలీ

ఉండి: రాష్ట్రంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై కాళ్ల మండలం జక్కరం, కాళ్ల, జువ్వలపాలెం, ఏలూరుపాడు వంతెన మీదుగా ఆకివీడు మండలం చెరుకుమిల్లి, ఐభీమవరం, ఆకివీడు, మాదివాడ మీదుగా ఉండి మండలం చెరుకువాడ, కలిసిపూడి, ఉండి మీదుగా తిరిగి పెదఅమిరం పార్టీ కార్యాలయానికి చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు నిట్ సమీపంలో విద్యుత్ లైన్‌లకు చెట్టు కొమ్మలు తెగి అడ్డుపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


బాలింతకు ఆర్థిక సాయం



నిత్యావసర వస్తువులు, నగదును అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన బాలింత గోతం రమ్యశ్రీకి సహాయార్థం ఆమె తల్లి తిరుపతి వెంకటలక్ష్మికి సంస్థ సభ్యులు నిత్యావసర వస్తువులు, రూ.2 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మిరియాల కిషోర్‌కుమార్, తమరాడ చిన్న, ముప్పిడి సురేష్‌రెడ్డి, సాధనాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

జూన్ 21 వరకు ఉచిత యోగా శిక్షణ



యోగా శిక్షణలో పాల్గొన్న వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 21 ఇంటర్నేషనల్ యోగా డే వరకు వాకర్స్ భవనంలో యోగా అవగాహన శిక్షణ కార్యక్రమాలు ప్రతి రోజు ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వాకర్స్ అధ్యక్షులు కేవీ చలం చెప్పారు. భవనంలో ఆదివారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో గురువు బడుగు చంద్రశేఖర్ యోగా ఆసనాలు, వాటి వల్ల ఉపయోగాలు వివరించారు. కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి పరమాత్మ, కె.నరసింహమూర్తి, వీఎన్ ప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు, సారథి, యోహాస్, మోహన్‌రావు, గురుమూర్తి పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి

తణుకు: ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బొద్దాని నాగరాజు, పీవీ ప్రతాప్, దిర్సిపో రామకృష్ణ పాల్గొన్నారు.

అమావాస్య చంద్రుడికి కానరాని పేదల ఇళ్లు

- పదేళ్లలో టీడీపీ హయాంలో పేదలకు దక్కని ఇళ్లు
- జగన్ పాలనలో భారీ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు
- చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు



వైఎస్సార్ హయాంలో పేదల కోసం తాళ్లకోడులో కొనుగోలు చేసి 74 ఎకరాల భూమి



జగన్ ప్రభుత్వంలో 74 ఎకరాల్లో సెంటు భూమిలో వేగంగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు



జగనన్న కాలనీలో సెంటు భూమిలో సుందరంగా నిర్మించిన భవనం

ఆకివీడు: అధికారంలో ఉండగా పేదల సొంతింటి కలను నీరుగార్చిన చంద్రబాబు.. జగనన్న ప్రభుత్వంలో సెంటు భూమిలో పేదలకు ఇళ్ల నిర్మాణం విషయమై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడంపై ఉండి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడుతున్నారు. ఉండి నియోజకవర్గంలో ముప్పై ఐదేళ్లకు పైగా అధికారంలో ఉన్న టీడీపీ.. నియోజకవర్గంలో పేదల్ని, బీసీలను మభ్యపెట్టి ఉండి నియోజకవర్గంలో పబ్బం గడుపుకుందన్నారు. టీడీపీ పాలనలో పేదలకు ఒక్క సెంటు భూమి కూడా కేటాయించిన దాఖలాలు లేవని వారు ధ్వజమెత్తుతున్నారు. మహానేత వైఎస్సార్ హయాంలో మండలంలోని కుప్పనపూడి గ్రామంలో పేదల కోసం 74 ఎకరాల భూమిని కొనుగోలు చేసి మెరక చేసి ఇళ్ల స్థలాలుగా లబ్ధిదారులకు కేటాయింపులు చేశారు. ఆ తరువాత టీడీపీ హయాంలో పదేళ్ల పాటు పేదలకు ఇళ్ల స్థలాలపై రాజకీయం చేసి, పట్టాల పంపిణీని నిలిపివేశారు. దశాబ్దకాలంగా పేదలకు స్థలాలు ఇస్తామని ఆశలు కల్పించి ఓట్లు దండుకున్నారని విమర్శిస్తున్నారు. అయితే కాలువ గట్లు, చెరువు గట్లు, రోడ్డు మార్జిన్లు, శ్మశాన భూముల్లో తరతరాలుగా జీవనం గడపుతున్న నిరుపేదలకు అండగా నేనున్నాను, నేను విన్నాను అని సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఈ 74 ఎకరాల్లో 3,400 మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. సెంటు భూమిలో ఇల్లు ఏ విధంగా నిర్మించుకుంటారని టీడీపీ నాయకులు ఎద్దేవా చేసినా, విమర్శలు గుప్పించినా లెక్కచేయకుండా పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఆర్థిక సహాయం చేయడంతో నిరుపేదలు వేలాదిగా ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. 74 ఎకరాలలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 1000కి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. మరో 1800 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. వందలాది మంది పేదల తమ ఇళ్లను సుందరంగా నిర్మించుకుంటున్నారు. బెడ్‌రూమ్, హాలు, కిచెన్, బాత్‌రూమ్‌ల నిర్మాణంతో పాటు ఎలివేషన్ నిర్మాణంతో భవనాలు సుందరంగా ఉన్నాయి. 74 ఎకరాల జగనన్న కాలనీ నేడు మేజర్ పంచాయతీని తలపిస్తోందంటే అతిశయోక్తి కాదు. కాలనీకి రహదారులు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించారు. మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. ఇటువంటి కాలనీలను చూసైనా అమావాస్య చంద్రుడు కళ్లు తెరుస్తాడని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొంటున్నారు.

నేడు బైక్ ర్యాలీ

పేదల సెంటు భూమిని స్మశాన వాటికతో పోల్చుతూ విమర్శించిన చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. కాళ్ల, ఆకివీడు, ఉండి మండలాల మీదుగా బైక్‌ర్యాలీ కొనసాగనుంది.

పేపర్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు శిక్షణ



తయారు చేసిన పేపరు కళాకృతులను చూపుతున్న విద్యార్థులు

ఉండి: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీయాలని యండగండి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్తిరాజు అన్నారు. ఆదివారం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులు శిక్షణలో చక్కని ప్రతిభ చూపారు. అలాగే సమ్మర్ క్యాంపులో నిర్వహించే క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, డిబేట్, క్యారమ్స్ తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని గ్రంథాలయ అధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ తెలిపారు.

ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు నిట్ సమీపంలో విద్యుత్ లైన్‌లకు చెట్టు కొమ్మలు తెగి అడ్డుపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పెడాయి కోడు ప్రక్షాళన పనులకు శ్రీకారం



ఉండిలో పెడాయి కోడు ప్రక్షాళన పనులను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: ఉండిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పెడాయి కోడు ప్రక్షాళనకు ఆదివారం శ్రీకారం చుట్టారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఉండిలోని గొడపేట ప్రాంతంలో సుమారు 12 ఏళ్లపైబడి పూడిక తొలగింపు పనులకు నోచుకోని డ్రెయిన్‌ను ఇప్పుడు బాగుచేసేందుకు పూనుకోవడం శుభపరిణామని అన్నారు. డ్రెయిన్‌లో పూడిక తొలగింపు పనులతో మురుగునీరు పారుదల సక్రమంగా జరిగి నివాస గృహాలు, పంట పొలాలు ముంపునకు గురికాకుండా ఉంటాయన్నారు. ఇటు ప్రజలు, ఆటు రైతుల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇదుకూరి శ్రీహరినారాయణరాజు, గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, ఎంపీటీసీ సభ్యులు వీరమల్లు సత్యవతి, కమతం బెనర్జీ, కరిమెరక చంద్రరావు, బడుగు బాలాజీ, యేడిద వెంకటేశ్వరరావు, అంగర రాంబాబు, బొచ్చా అచ్చారావు, రాయి సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్లలో చెట్ల తొలగింపు



ఉప్పుటేరు సమీపంలో ఎన్‌హెచ్ మార్జిన్లలో చెట్లను తొలగింపు చర్యల్ని పర్యవేక్షిస్తున్న ఎస్ఐ కె.రాజారెడ్డి

ఆకివీడు: రోడ్డు మార్జిన్లలో, మలుపుల వద్ద చెట్లు దట్టంగా పెరిగి తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతో జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఆదేశాల మేరకు చెట్ల తొలగింపు పనులను చేపట్టారు. దుంపగడప గ్రామంలోని ఎన్‌హెచ్ ప్రాంతంలో ఆదివారం చెట్లను జేసీబీతో తొలగించారు. ఉప్పుటేరు వంతెన దిగువ భాగంలో రోడ్డు మలుపు వద్ద చెట్లు విపరీతంగా పెరిగి రహదారి కనిపించకుండా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్సై రాజారెడ్డి చెప్పారు. వాహనాలు కూడా తిరగబడిపోతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు చెట్లు తొలగించామని చెప్పారు. అదేవిధంగా జాతీయ రహదారిలో పలు చోట్ల రోడ్డు మార్జిన్లు కనిపించకుండా చెట్లు, ఇతర ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. స్థానిక తెల్ల వంతెన సమీపంలో జాతీయ రహదారి గతుకులతో ఉండటం వల్ల వాహనాలు అదుపుతప్పుతున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మార్జిన్‌లతో పాటు ప్రమాదభరితంగా ఉన్న రోడ్లను కూడా బాగుచేయించే చర్యల్ని చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమామహేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మెంటేవారి తోట సుందరయ్య భవనంలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల సేవలను ఆయన అభినందించారు. వైద్య శిబిరంలో అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన డాక్టర్ డి.సందీప్ వర్మ తదితరులు వైద్య సేవలు అందించారు. తక్కువ ధరలకే అవసరమైన ఔషధాలను, ఇన్సులిన్ నెలలవారీగా అందించారు. రోగులకు బిపి, షుగర్, అవసరమైన వారికి ఉచిత పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పలువురు రోగులకు మందులను అందజేశారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, కో-ఆర్డినేటర్ ఎంవీ రామరాజు, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం ప్రతినిధి వి.రాధాకృష్ణ, ట్రస్టీ బి.వాసుదేవరావు, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ మల్లుల శ్రీనివాస్, సీహెచ్ మావో అజయ్ కుమార్, ప్రమోద్, సాహితీ స్రవంతి కన్వీనర్ చైతన్య ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి.సీతారామరాజు పాల్గొన్నారు.

వేంద్రలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేంద్ర జెడ్పీ హైస్కూల్లో కలుసుకున్న 2006-2007 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పాలకోడేరు: పదిహేడేళ్ల క్రితం వేంద్ర జెడ్పీ హైస్కూల్‌లో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. పరస్పరం యోగక్షేమాలను తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులకు అందరూ కలిసి సాయం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హరికృష్ణ, రాజు ప్రసాద్, మహేష్, లలిత, కనక శ్రీలక్ష్మి, దేవి, జై జ్యోతిరామ్, హరీష్, సతీష్ పాల్గొన్నారు.

నేటి నుంచి వరాల వెంకన్న బ్రహ్మోత్సవాలు

అత్తిలి: ఈడూరులో శ్రీదేవి, భూదేవి సమేత వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు నిర్మించి, స్వాగత ద్వారాల నుంచి విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్‌లను ఏర్పాటు చేసారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే స్వామివారిగా ప్రసిద్ధిగాంచిన వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. సోమవారం ఉదయం సన్నిధినాగ వెంకటసత్య సూర్యరామలింగేశ్వరరావు, వీరపద్మ, మామిడిపల్లి రాంబాబు, నాగమణి దంపతులతో స్వామివారికి సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాలసేవ నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని పెళ్లి కుమారుడిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. సాయంత్రం అల్లూరి మోహనమురళీరాజు, మాధురి దంపతులతో ప్రత్యేక పూజ లు, హోమాలు నిర్వహిస్తారు. ఈనెల 30న రాత్రి గజవాహన సేవ అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు, ఆలయ ఈవో పిల్లి సూర్యనారాయణ తెలిపారు. 31వ తేదీన స్వామివారి తీర్థ మహోత్సవం, అఖండ అన్నసమారాధన, రథోత్సవం నిర్వహిస్తారు. జూన్ 1న సింహవాహన సేవ, వేంకటేశస్వామివారి సంబరం, 2న సుదర్శన హోమం, గరుడవాహన సేవ, 3న శేషవాహన సేవ, 4న పూర్ణాహుతి, చక్రస్నాన కార్యక్రమంతో శ్రీస్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయని వారు చెప్పారు. శ్రీస్వామివారి కల్యాణోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పెన్మెత్స ప్రభాకర కోటి రామలింగరాజు తెలిపారు.

మహిళా మార్టులో ముదునూరి షాపింగ్



చేయూత మహిళా మార్టులో సరుకులు కొనుగోలు చేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తన ఇంటికి కావాల్సిన సరుకుల చిట్టాలో చేయూత మహిళామార్టుకు వచ్చి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశారు. నిత్యం ప్రజాజీవనంలో ఎంతో బిజీగా ఉండే ఆయన తీరిక చేసుకుని మరీ నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. డ్వాక్రా సంఘాల సభ్యులంతా ఇటీవల కాలంలో ఐక్యంగా ఏర్పాటు చేసుకున్న చేయూత మహిళా మార్టును ఎమ్మెల్యే ప్రారంభించారు. అయితే తాను ప్రారంభించిన షాపు అమ్మకాలను ఆయనే స్వయంగా వచ్చి పరిశీలించడంతో పాటు ఇంటికి కావాల్సిన సరుకులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారానికి నమ్మకమే పెట్టుబడి అని, ప్రజలకు కల్తీ లేని నాణ్యమైన సరుకులను సరసమైన ధరలకు అందించాలని సిబ్బందికి సూచించారు. మహిళా మార్ట్ అమ్మకాలను గురించి, సరుకుల నాణ్యతను గురించి ఆరా తీశారు. ఒక్కసారిగా ఎమ్మెల్యే కొనుగోలుదారుగా మారి షాపుకు రావడంతో అక్కడి సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మిక భావన పెంపొందించాలి



ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడానికి ఉత్సవ కమిటీలు కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం ములపర్రులోని విశ్వేశ్వర స్వామి దేవస్థానం ఉత్సవకమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. పెనుగొండలో నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ ఆలయంలోనూ, పెనుగొండ పెద్దింట్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి నిధులు సమకూర్చామన్నారు. నియోజకవర్గంలో పలు ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పెచ్చెట్టి పెద్దిరాజు, సభ్యులుగా నార్కెడిమిల్లి వెంకట అన్నపూర్ణాదేవి, అండలూరి శ్రీను, యెల్లా చంద్రావతిలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి(బాబిరెడ్డి), పార్టీ నాయకులు దంపనబోయిన బాబూరావు, బొక్కాదాసు, బొక్కా మార్కండేయులు, కట్టా ఏడుకొండలు, కడలి భాస్కరరావు, బోణం శ్రీను, పీతల వెంకన్న, బొక్కా అరుణ, పితాని తిరపయ్య, యండ్ర రాముడు, జక్కంశెట్టి సత్యనారాయణ, గుత్తుల యాదవరావు, గుత్తుల గోవిందు, ఎస్.రాజబాబు, మామిడి శెట్టి గోవిందులు పాల్గొన్నారు.

జీవితంలో ఆనందం, సంతృప్తి ముఖ్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సమితి అధ్యక్ష, కార్యదర్శులు

తణుకు టౌన్: జీవితంలో ఆనందం, సంతృప్తి ముఖ్యమని, భార్యాభర్తలు, పిల్లలు బంధువులతో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం ద్వారానే మంచి సమాజం ఏర్పడుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ కె శివశంకర్ చెప్పారు. ఆదివారం తణుకు రామకృష్ణ సేవా సమితి భవన్‌లో వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్ సెంటర్, సెంటర్ ఫర్ హోలిస్టిక్ డవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ కాన్షియస్‌నెస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జీవన విద్య కార్యశాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో భార్యాభర్తలలో ఏర్పడే ఆందోళన, కోపం, చిరాకు, వంటి వాటిని ఎలా ఎదుర్కోవాలో వివిధ కృత్యాల ద్వారా వివరించారు. బంధువులు, జీవిత భాగస్వామితో సరైన సంబంధాలు పెంపొందించుకునే వివిధ చర్య, ప్రతిచర్యలను వివరించారు. పిల్లలు తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ అక్కింశెట్టి రాంబాబు రచించిన భార్య, భర్త సైకాలజీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రామకృష్ణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు మల్లిన రామచంద్రరావు, అధ్యక్షుడు బోగవల్లి శ్రీమన్నారాయణ, కార్యదర్శి చిలుకూరి రామకృష్ణ, కన్వీనర్ చిలుకూరి సుజాత, కోఆర్డినేటర్ కె గిరీశ్వరరావు, డాక్టర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

మేధావులు రాజకీయాల్లోకి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సాక్షి, భీమవరం: సమాజంలో మేధావులు రాజకీయాల్లోకి రావాలని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. భీమవరంలో ఆదివారం నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న విద్యార్థి సంఘంగా నిలిచిందన్నారు. విద్యార్థి దశలోనే రాజకీయాలు, సమాజంపై అవగాహన కలిగి సేవ చేసే గుణం ఉంటుందన్నారు. తొలుత యూనియన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య జెండా ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభం

సాక్షి, భీమవరం: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే కోస్తాంధ్ర జిల్లాల విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణా తరగతులను ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు పాల్గొన్నారు.